నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శుక్రవారం 5 జూలై 2024 | MEDAK

మిమ్మల్ని కంటికి రెప్పలా కాపాడుకుంటా

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాలలో ఎంపీటీసీలను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల, జూలై 4 : చేర్యాల ప్రాంత ప్రజలు తనను అక్కున చేర్చుకుని ఎమ్మెల్యేగా గెలిపించారని, ఈ ప్రాంత ప్రజలకు రుణపడి ఉంటానని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. చేర్యాలలోని భద్రకాళీ గార్డెన్స్‌లో గురువారం ఎఎంపీడీవో మహబుబ్ అలీ అధ్యక్షతన నిర్వహించిన ఎంపీటీసీల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పదవి ఉన్నా లేకున్నా ప్రజాసేవలో రాజకీయ నాయకులు నిమగ్నం కావాలన్నారు. జనగామ,చేర్యాల ప్రాంతాల అభివృద్ధికి తాను అహర్నిశలు కృషి చేస్తున్నానన్నారు. మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని, మీతో పాటు గులాబీ శ్రేణులను తాను కంటికి రెప్పల కాపాడుకుంటానని భరోసా ఇచ్చారు. తన సొంత దవాఖానలో ఉచితంగా వైద్యసేవలు అందిస్తానని, మీ గ్రామాలకు కావాల్సిన వసతులు, సదుపాయాలు కల్పించేందుకు ముందుంటానని తెలిపారు.గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని అన్నారు. అనంతరం ఎంపీపీ పుల్లంపల్లి కరుణాకర్, వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్ రెడ్డి, ఎంపీటీసీలను ఎమ్మెల్యే సన్మానించారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ సుంకరి మల్లేశం గౌడ్, వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నిమ్మ రాజీవ్‌రెడ్డి, ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అనంతుల మల్లేశం, ముస్త్యాల నాగేశ్వర్‌రావు,మేక సంతోష్, మంద యాదగిరి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల్‌నర్సయ్య, అంకుగారి శ్రీధర్ రెడ్డి, తాడెం రంజిత కృష్ణమూర్తి, సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పెడుతల ఎల్లారెడ్డి, పచ్చిమడ్ల మానస, శివగారి అంజయ్య, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జింకల పర్వతాలుయాదవ్, గదరాజు చందు తదితరులున్నారు.

పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేస్తా..

కొమురవెల్లి, జూలై 4 :గ్రామాల్లో ఎంపీటీసీల సేవలు మరువలేనివని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నాడు. గురువారం కొమురవెల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తలారి కీర్తనాకిషన్ అధ్యక్షతన జరిగిన ఎంపీటీసీల సన్మాన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ.. ఎంపీటీసీలకు గౌరవ వేతనం రూ.5వేలు చేసిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అన్నారు. పార్టీలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి చేయూత అందిస్తానన్నారు. కొమురవెల్లికి తొలి ఎంపీపీని కావడం గర్వంగా ఉందని ఎంపీపీ తలా రి కీర్తన అన్నారు. తనకు బీ ఫారంతో పాటు తన గెలుపునకు కృషిచేసిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె భావోద్వేగానికి గురైంది. అనంతరం ఎంపీపీ తలారి కీర్తనాకిషన్, జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, వైస్ ఎంపీపీ కాయిత రాజేందర్‌రెడ్డితో పాటు ఎంపీటీసీలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఘనంగా సన్మానించాడు. కార్యక్రమంలో ఎంపీడీవో కుమారస్వామి, మండల ప్రత్యేకాధికారి జి.సరోజన, ఎంపీటీసీల పోరం మండల అధ్యక్షుడు సాయిమల్లు తదితరులు పాల్గొన్నారు.



కొమురవెల్లిలో ఎంపీపీ, జడ్పీటీసీ, ఎంపీటీసీలకు సన్మానం చేస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డిలో ఇండ్ల మధ్య పేరుకు పోయిన చెత్తాచెదారం

సంగారెడ్డి జిల్లా పోతిరెడ్డిపల్లి ఎక్స్‌రోడ్ పోలీస్‌స్టేషన్ వద్ద పేరుకుపోయిన చెత్త

సంగారెడ్డి బైపాస్ రోడ్డులో అధ్వాన పరిస్థితులు

పరేషాన్‌లో పంచాయతీలు

- ఆరు నెలలుగా గ్రామ పంచాయతీలకు నిధులు నిల్
- రూపాయి విడుదల చేయని కాంగ్రెస్ ప్రభుత్వం
- గ్రామాల్లో చేతులెత్తేసిన ప్రత్యేకాధికారులు
- భారమంతా పంచాయతీ కార్యదర్శులపైనే..
- అప్పులు తెచ్చి ఖర్చు చేస్తున్న కార్యదర్శులు
- ఆరు నెలలుగా పారిశుధ్య కార్మికులకు జీతాలు లేవు
- ఎక్కడి చెత్త అక్కడే...కంపు కొడుతున్న మోరీలు
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 1615 పంచాయతీలు

సిద్దిపేట, జూలై 4(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గ్రామ పంచాయతీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. పారిశుధ్యం, అభివృద్ధి పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుంది. సిద్దిపేట(499), మెదక్(469), సంగారెడ్డి(647) జిల్లాల్లో మొత్తం 1615 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గ్రామ పంచాయతీలకు ఒక్క రూపాయి నిధులు ఇవ్వలేదు. ఫిబ్రవరి నుంచి గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. ప్రత్యేకాధికారుల పాలనకు ముందే పంచాయతీల్లో నిధులు ఖాళీ అయ్యాయి. ఫలితంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు అప్పులు తెచ్చి గ్రామాల్లో నెలకొన్న చిన్నచిన్న సమస్యలను పరిష్కరిస్తున్నారు. ఆరు నెలలుగా ఒక్కో పంచాయతీ కార్యదర్శి లక్ష వరకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్నికల ముందు గొప్పలు చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్రామాల అభివృద్ధిని పూర్తిగా విస్మరించింది. బీఆర్ఎస్ హయాంలో గ్రామాల అభివృద్ధికి పల్లెప్రగతి కార్యక్రమాన్ని తీసుకొచ్చి నెలనెలా నిధులు సమకూర్చింది. ఫలితంగా గ్రామాల్లో పచ్చని పరిశుభ్ర వాతావరణం కనిపించింది. ఇవ్వాళ ఆరు నెలలుగా గ్రామాలకు నిధులు లేక పోవడంతో పారిశుధ్యం కంపు కొడుతున్నది. ఎక్కడి చెత్త అక్కడే కుప్పలుగా పేరుకుపోయింది.

సిద్దిపేట రూరల్ మండలం రావు రూకుల గ్రామంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

జీపీ ఖాతాలు ఖాళీ..

గ్రామ పంచాయతీలకు ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవండతో ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని జీపీలు నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నాయి. జీపీ బ్యాంక్ ఖాతాల్లో నిధులు లేకపోవడంతో ఖాతాలు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా గ్రామాలకు మూడు రకాల ఖాతాలు ఉంటాయి. వీటిలో ఒకటి ఆస్తిపన్ను జమ చేసుకునే ఖాతా.. ప్రస్తుత పరిస్థితిల్లో ఆస్తి పన్ను అంతంత మాత్రంగానే వసూలు జరుగుతున్నది. రెండో ఖాతా ఎస్ఎఫ్‌సీ ఇందులో ప్రభుత్వం విడుదల చేసిన ప్రత్యేక నిధులను జమ చేస్తారు. ఆరు నెలలుగా ఈ ఖాతా పూర్తిగా ఖాళీగానే ఉంది. మూడో ఖాతాలో కేంద్ర ప్రభుత్వం నేరుగా నిధులను జమ చేస్తుంది. గ్రామాల్లో ఉండే జనాభా ప్రతిపాదికన ఈ నిధులను జమ చేస్తారు. ప్రతి మూడు లేదా నాలుగు నెలలకు ఒక్క సారి జమ అవుతాయి. వీటిని గ్రామాల్లో ప్రత్యేక పనులకు ఖర్చు చేసుకుంటారు.

అప్పుల పాలవుతున్న పంచాయతీ కార్యదర్శులు

నాలుగు నెలలుగా గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్నది. గ్రామాలకు చుట్టపు చూపుగా వచ్చి పోతున్నారే తప్ప సమస్య పరిష్కారానికి చొరవ చూపకుండా పూర్తిగా చేతులెత్తేశారు. ఫలితంగా భారమంతా పంచాయతీ కార్యదర్శులపైనే పడుతున్నది. ఇప్పటికే ఒక్కో పంచాయతీ కార్యదర్శి లక్షల్లో అప్పులు తీసుకొచ్చి పెడుతున్నారు. ప్రధానంగా గ్రామాల్లో పారిశుధ్యం పనులతోపాటు, మంచినీటి పైప్‌లైన్, బోర్ల మరమ్మతులు, పంచాయతీ ట్రాక్టర్ల నెలవారీ కిస్తీలు, విద్యుదీపాలు. విద్యుత్ బకాయిలన్నీ కార్యదర్శుల మీదనే పడుతున్నాయి.

ఆరు నెలలుగా కార్మికులకు జీతాలు లేవు

గ్రామాల్లో పనిచేసే పారిశుధ్య కార్మికులకు ఆరు నెలలుగా జీతాలు లేవు. నెలనెలా జీతాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ సర్కార్ వారిని పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామాల్లో పారిశుధ్యం పక్కదారి పట్టింది. ఎక్కడికక్కడ చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. మోరీల్లో చెత్త పేరుకపోయింది. వర్షాకాలం కావడంతో చెత్తాచెదారం, మురుగు కాలువల్లో దోమలు ఎక్కువై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

కేసీఆర్ ప్రభుత్వంలో పల్లె ప్రగతి నిధుల వెల్లువ..

కేసీఆర్ హయాంలో ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని గ్రామాలు పల్లెప్రగతితో అభివృద్ధి సాధించాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో గ్రామాలను అభివృద్ధి చేసింది. ఉమ్మడి జిల్లాకు సుమారుగా నెలకు రూ.30 కోట్ల పైచిలుకు నిధులు వచ్చాయి. ఆ నిధులతో గ్రామాలను అద్భుతంగా తీర్చిదిద్దారు. ప్రతి ఊరికి డంపింగ్ యార్డు, హరితహారంలో విరివిగా మొక్కలు నాటించారు. తాగునీటి సమస్య లేకుండా ప్రతి ఇంటికీ నల్లా ద్వారా నీటిని అందించారు. దీంతో జాతీయ, రాష్ట్రస్థాయిలో జిల్లాలోని పలు గ్రామాలు అవార్డులు సాధించాయి. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామ పంచాయతీల అభివృద్ధి కుంటుపడింది.

సంగారెడ్డి జిల్లా కంది మండలం చర్యల గ్రామంలో చెత్తాచెదారం

సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు లో పారిశుధ్య నిర్వహణ లోపంతో మురుగుతో నిండిపోయిన డ్రైనేజీ, రోడ్డుపై వేసిన చెత్త సంచులు

నిర్వాసితులకు పూర్తి పరిహారం చెల్లించండి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, జూలై 4: మెట్ట ప్రాంత వరప్రదాయినీ గౌరవెల్లి రిజర్వాయర్ కాలువల నిర్మాణానికి వెంటనే నిధులు విడుదల చేసి ఈ ప్రాంతానికి సాగునీరందేలా కృషిచేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేసినట్లు సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి తెలిపారు. గురువారం ఆయన పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. ఎత్తిపోతల పథకం ద్వారా మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్‌కు సాగునీరందించాలనే డిమాండ్ 1980 నుంచే ప్రారంభం అయిందని, ఆ ఉద్యమాన్ని గుర్తించి ఇందిరాగాంధీ ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ద్వారా వరద కాలువ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని సీఎంకు వివరించినట్లు తెలిపారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాదయాత్రలో భాగంగా ఇక్కడి పరిస్థితులను చూసిన ఆయన 2007లో గౌరవెల్లి రిజర్వాయర్‌కు శంకుస్థాపన చేశారని గుర్తు చేశారు. గత ప్రభుత్వం రిజర్వాయర్ సామర్థ్యం పెంచి తుదిదశకు తెచ్చిందని, మిగతా పనులు పూర్తి చేయడంతో పాటు కాలువల నిర్మాణానికి యుద్ధప్రాతిపదికన చేపట్టాలని వినతిపత్రంలో కోరినట్లు పేర్కొన్నారు. భూనిర్వాసితులకు పూర్తిస్థాయిలో పరిహారం ఇచ్చి వారికి న్యాయం చేయాలని కోరారు. సీఎం సానుకూలంగా స్పందించారని, త్వరలోనే నిధులు మంజూరు చేసి భూనిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వెంకటరెడ్డి తెలిపారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు

చేర్యాల, జూలై 4 : సిద్దిపేట జిల్లా చేర్యాల నుంచి గడీతోట గ్రామానికి వెళ్లే రహదారిలో పలు విద్యుత్ స్తంభాలు ఒకవైపు వంగిపోయి ప్రమాదకరంగా మారాయి. గడీతోట దారిలో ఉన్న బాబా ఆశ్రమం వద్దకు నిత్యం వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఇదే రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాలు 15 వరకు వంగిపోయి కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి. స్తంభాలు ఏర్పాటు చేసిన ప్రదేశం సైతం నల్లరేగడి భూమి కావడంతో స్తంభాలు రోజురోజుకు వంగిపోతున్నాయి.ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

జడ్పీ సమావేశంలో వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

పదవీకాలం ముగిసిన జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

కంది, జూలై 4: ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం సంగారెడ్డిలో జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి అధ్యక్షతన జడ్పీ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథులుగా మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్ వల్లూరు క్రాంతి హాజరయ్యారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీల సమక్షంలో శాఖలవారీగా జరిగిన అభివృద్ధి అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లా విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. ప్రజాప్రతినిధిగా ప్రజల అభివృద్ధికి స్పష్టమైన దృక్పథంతో ముందుకు సాగితే ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. ఉన్న నిధులను సద్వినియోగం చేసుకొని చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారానికి అలుపెరుగకుండా పనిచేసిన ఎంతోమంది నాయకులు ఉన్నారని, వారిని ఆదర్శంగా తీసుకొని ప్రజాప్రతినిధులు అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. మారుమూల గ్రామాలకు నలువైపులా రోడ్డు సౌకర్యాలు కల్పిస్తే కనెక్టివిటీ పెరిగి గ్రామాలు అభివృద్ధి చెందుతాయన్నారు. సంగారెడ్డికి రింగ్ రోడ్డు అవసరం ఉందని, ఇందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. రింగ్ రోడ్డుకు ఎంపీలు సహకరించాలన్నారు. నారాయణఖేడ్, జహీరాబాద్ ప్రాంతాల్లోని ప్రభుత్వ దవాఖానల్లో మందుల కొరత ఉందని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకురాగా, స్పందించిన మంత్రి మందుల కొరత లేకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపి కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉన్నదన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ మంజూశ్రీజైపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఐదేండ్ల పదవీకాలంలో ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశానన్నారు. సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పదవీకాలం ముగిసిన జడ్పీ చైర్మన్, జడ్పీటీసీలు, ఎంపీపీలను శాలువాలతో సత్కరించారు. అంతకు ముందు జడ్పీ ఆవరణలో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా మంత్రి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మెదక్, జహీరాబాద్ ఎంపీలు రఘునందన్‌రావు, సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యేలు చింతా ప్రభాకర్, వాకిటి సునీతాలక్ష్మారెడ్డి, మాణిక్‌రావు, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జడ్పీసీఈవో జానకిరెడ్డి పాల్గొన్నారు.

రహదారులు, సబ్ సెంటర్లకు నిధులు మంజూరు చేయాలి

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

రహదారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సబ్ సెంటర్లకు కావాల్సిన నిధులు మంజూరు చేయాలి. సంగారెడ్డి పట్టణంలో ఆరు సబ్ సెంటర్ల నిర్మాణ పనులు పూర్తయ్యాయని, మరో ఆరు సబ్ సెంటర్ల పనులు ప్రారంభం కాలేదు. సబ్ సెంటర్లు పూర్తి చేసేందుకు రూ.20లక్షల నిధులు సరిపోవడం లేదని, సరిపడా నిధులు మంజూరు చేయాలి. సదాశివపేట మండలం ఆత్మకూర్ గ్రామం నుంచి పొట్టిపల్లి క్రాస్‌రోడ్, ఎటిగడ్డసంఘం, మలాపాడు గ్రామాల మీదుగా సింగూర్ వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయమైంది. ఈ రహదారి మరమ్మతులకు సత్వరం నిధులు కేటాయించాలి. సంగారెడ్డికి కూతవేటు దూరంలో ఉన్న మంజీరా ప్రాంతానికి నిధులు కేటాయించి పర్యాటక ప్రాంతంగా మార్చాలి.

హాజరైన ఎంపీలు, ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు

సంగారెడ్డికి ఔటర్ రింగ్‌రోడ్డు

- ఆ దిశగా జిల్లా ఎంపీలు కృషిచేయాలి
- కేరళ , తమిళ నాడు నే తలను స్ఫూర్తిగా తీసుకోవాలి
- మెదక్ జిల్లా ఎంతోమంది గొప్పనే తలను అందించింది
- మంత్రి దామోదర రాజనర్సింహ

సంగారెడ్డి, జూలై 4(నమస్తే తెలంగాణ) : జిల్లాకేంద్రమైన సంగారెడ్డికి ఔటర్ రింగ్‌రోడ్డు అవసరమని, ఇందుకు జాతీయ రహదారుల సంస్థ నుంచి మెదక్, జహీరాబాద్ ఎంపీలు ఇద్దరు నిధులు తీసుకురావాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కోరారు. గురువారం సంగారెడ్డిలో జడ్పీ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. సంగారెడ్డి జిల్లాకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. పరిశ్రమలు, ప్రముఖ విద్యాసంస్థలు, వనరులకు నెలవైన జిల్లాను అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలిపేందుకు మంత్రిగా తాను కృషిచేస్తానని తెలిపారు. తమిళనాడు, కేరళ ప్రజాప్రతినిధులు వారి ప్రాంతం కోసం అంకితభావంతో పనిచేస్తారని, వారిని స్ఫూర్తిగా తీసుకుని మన ప్రజాప్రతినిధులు తమ ప్రాంత అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. తన 32 ఏండ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ఎత్తుపల్లాలు, గెలుపోటములు చూశానన్నారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని , ప్రజల వైపు నిలబడడం, ప్రజా సంక్షేమానికి పనిచేయడం ప్రతి నాయకుడు, ప్రజాప్రతినిధి కర్తవ్యం అన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లా రాష్ట్రానికి ఎంతోమంది గొప్పనేతలను అందించినట్లు గుర్తు చేశారు. నర్సాపూర్ ఎమ్మెల్యేగా పనిచేసిన దివంగత నేత విఠల్‌రెడ్డి తన నియోజకవర్గ అభివృద్ధికి నిధులు సాధన, ప్రజా సమస్యల పరిష్కారంపై ఎక్కువ దృష్టి పెట్టేవారన్నారు. మంత్రులతో పాటు కలెక్టర్‌ను స్వయంగా కలిసి తన నియోజకవర్గానిక కావాల్సిన పనులు చేయించుకునేవారని తెలిపారు. ప్రస్తుత ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ నియోకజవర్గాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డి, జడ్పీటీసీ, ఎంపీపీలు ఐదేండ్ల కాలంలో బాగా పనిచేశారని మంత్రి అభినందించారు. జడ్పీచైర్‌పర్సన్ మంజుశ్రీజైపాల్‌రెడ్డితో పాటు జడ్పీటీసీ, ఎంపీపీలను ఘనంగా సన్మానించారు.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తిని కొనసాగించాలి

రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్‌లో దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, నాయకులు

హుస్నాబాద్, జూలై 4: దొడ్డి కొమురయ్య జీవితం బడుగు, బలహీన వర్గాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గురువారం హుస్నాబాద్‌లోని ఆరెపల్లిలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య 78వ వర్ధంతిలో పాల్గొని కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన ఘనత దొడ్డి కొమురయ్యకే దక్కుతుందన్నారు. రజాకార్లకు, భూస్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి ఎందరికో స్ఫూర్తినిచ్చిన కొమురయ్య చరిత్రను ప్రజలు మర్చిపోరన్నారు. నేటి యువత కొమురయ్య ఆశయ సాధన కోసం ముందుండి పోరాటాలు చేసి, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకట్, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్లు వల్లపు రాజు, పున్న లావణ్యసది, చిత్తారి పద్మ, భూక్య సరోజన, మడప జయపాల్‌రెడ్డి, కేడం లింగమూర్తి, వెన్న రాజు, దండి లక్ష్మి, మేకల వీరన్నయాదవ్, ఎగ్గిడి అయిలయ్య, సంగ కుమారస్వామి, మైదంశెట్టి వీరన్న పాల్గొన్నారు.